ప్రజాశక్తి
బుధవారం 18 జూన్ 2025
5
అనంతపురం





◆ పావులు కదుపుతున్న వైస్‌చైర్మన్ బాబాయ్
◆ కౌన్సిలర్‌కు రూ.3లక్షలకు బేరం..!?
◆ మాజీ మంత్రుల గ్రూపుల మధ్య పోటాపోటీ
◆ పట్టుకోసం ఉషశ్రీచరణ్, మౌనంగా శంకరనారాయణ
◆ తన ప్రయత్నంలో మండల ప్రజాప్రతినిధి భర్త

# కదులుతోన్న చైర్మన్ పీఠం

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పెనుకొండ కంచుకోట. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర రాజకీయ ప్రవేశం నుంచి ఇక్కడ టిడిపి ఎదురులేని విజయాలు సాధించింది. 2019 ఎన్నికల వరకు తెలుగుదేశం పెనుకొండలో ఓటమి ఎరుగలేదు. 2019లో వైసిపి తొలి సారిగా గెలు పొందింది. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం తిరుగు లేని ఆధిక్యం సాధించింది. పెనుకొండ మున్సిపాల్టీలో 20వార్డుల్లో 18 స్థానాలు వైసిపి గెలుచుని చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోవడంతో పరిస్థితి మొత్తం మారిపోయింది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పెనుకొండ నగరపంచాయతీ చైర్మన్ పీఠంపై కదులుతోంది.





**కౌన్సిలర్‌కు రూ.3లక్షలకు బేరం.!?**

చైర్మన్ ఉమర్‌ఫరూఖ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయన్ను ఆ స్థానం నుంచి దింపేందుకు వైస్‌చైర్‌పర్సన్ నందిని రెడ్డి బాబాయి కౌన్సిలర్లకు బేరంపెట్టినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క కౌన్సిలర్‌కు రూ.3లక్షలు ఇచ్చి తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే వాదన ఆ పార్టీ నేతల నుంచే విన్పిస్తోంది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు ఆయనకు మద్దతు తెలిపినట్లు సమాచారం.

**పావులు కదుపుతున్న వైస్‌చైర్మన్ బాబాయ్ ..**

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులున్నాయి. అందులో టిడిపికి కేవలం 2 వార్డుల్లో కౌన్సిలర్లు ఉన్నారు. మిగిలిన వార్డుల్లో వైసిపి అభ్యర్థులే విజయం సాధించారు. కాగా పెనుకొండ వైసిపికి సంబంధించి ఇద్దరు నాయకులు నాయకత్వం నడుస్తోంది. మాజీ మంత్రులు శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ వర్గాలకు చెందిన నేతలు ఆ పార్టీలో ఉన్నారు. ప్రస్తుత చైర్మన్ ఉమర్‌ఫరూఖ్ శంకరనారాయణ పెనుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన ఆశీస్సులతో చైర్మన్‌గా ఎన్నికైయ్యారు. 2024 ఎన్నికల్లో పెనుకొండ వైసిపి అభ్యర్థిగా ఉషశ్రీ చరణ్ రావడంతో ఆ పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇప్పటికీ ఈ రెండు గ్రూపుల మధ్య విభేదాలు నడుస్తూనే ఉన్నాయి. వైస్ చైర్మన్‌గా ఉన్న నందినిరెడ్డి బాబాయ్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈయనకు అండగా ఉషశ్రీ చరణ్ తెరవెనుక ఉండి నడిపిస్తున్నట్లు సమాచారం. మరో వైపు ప్రస్తుత చైర్మన్ ఉమర్‌ఫరూఖ్‌కు మద్దతుగా శంకరనారాయణ మద్దతుదారులు ఉన్నారు. ఈ రెండు గ్రూపులు చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు వారివారి దారుల్లో ప్రయత్నాలు చేస్తున్నారు.

**అవిశ్వాసానికి నాలుగు నెలల సమయం**

పెనుకొండ నగరపంచాయతీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టెందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఇంతలోనే ఎందుకు రచ్చ చేస్తున్నారని కొందరు వైసిపి ముఖ్య నాయకులు చురకలు వేసినట్లు సమాచారం. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాల్సిన నాయకత్వం ఇలా వర్గపోరుతో పార్టీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏది ఏమైనా పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ పీఠం కోసం వైసిపిలో మూడుముక్కలాటను తెలుగుతమ్ముళ్లు మౌనంగా వీక్షిస్తున్నారు. అవసరమైనప్పుడు 'అధికార' బలంతో రంగంలోకి దిగాలని వారు కూడా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

**గ్రూపులుగా మాజీ మంత్రుల మద్దతుదారులు**

పెనుకొండలో వైసిపి జెండా గెలుపునకు మాజీ మంత్రి శంకరనారాయణ కృషి ఉంది. 2024 ఎన్నికలకు ముందు ఆ పార్టీ అధిష్టానం శంకరనారాయణను పెనుకొండ నుంచి మార్చి అనంతపురం ఎంపి అభ్యర్థిగా పంపింది. ఇక కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఉషశ్రీచరణ్‌ను పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిపారు. ఉషశ్రీ చరణ్ రాకను శంకరనారాయణ మద్దతుదారులు వ్యతిరేకించారు. ఎన్నికల్లో కూడా ఈ రెండు వర్గాల మధ్య వైరం నడిచింది. ఇప్పటికీ అది కొనసాగుతూనే ఉంది. రెండు వర్గాల మధ్య నెలకొన్న వైరం కారణంగానే చైర్మన్ మార్పు అంశం తెరపైకి వచ్చినట్లు తెలు స్తోంది. చైర్మన్ ఉమర్ ఫరూ క్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించే అంశం శంకర నారా యణకు తెలిసినప్పటికీ ఆయన ఇప్పటికీ దీనిపై మౌనంగా ఉన్నారు.

**మైనార్టీ కౌన్సిలర్‌కోసం చర్చలు**

చైర్మన్ అంశానికి సంబంధించి పెనుకొండ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త పట్టణానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ మహ్మమద్ తయూబ్‌ను తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. ఆయన్ను ఎలాగైనా చైర్మన్‌ను చేయాలనే పట్టుదలతో వనరులు సమకుర్చుతున్నారనే చర్చలు సాగుతున్నాయి.

# సాయం కోసం ఎదురుచూపు

◆ ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టం
◆ పంటనష్టానికి పరిహారం అందేదెన్నడో.?
◆ ప్రభుత్వంపై అన్నదాత ఆశలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి వైపరిత్యాలతో దెబ్బతిన్న పంట నష్టానికి సంబంధించి పరిహారం కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలోనైనా సాయం అందితే పెట్టుబడులకు ఊరట లభించనుంది. ఇది ఎప్పటికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. 2024 ఖరీఫ్‌లో ఆగస్టు వరకు వర్షాభావంతో ఆ తరువాత అధిక వర్షాలకు పంటల దెబ్బతిన్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన కూడా చేసింది. ప్రకటించిన కరువు మండలాలే చాలా తక్కువని, అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఆ తక్కువలోనూ నష్టపోయిన దానికి పరిహారం అందలేదు.

**అనంతపురం జిల్లాలో..**

అనంతపురం జిల్లాలో 2024 ఖరీఫ్‌లో ప్రభుత్వం ఏడింటిని కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందులో 14,116 మంది రైతులు పంటనష్టపోయారని అధికారులు తేల్చారు. దీనికి రూ.20.19 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. ఆ తరువాత అక్టోబరు, నవంబరు మాసాల్లో అధిక వర్షాల వల్ల 341 మంది రైతులు పంట నష్టపోయారు. దీనికి రూ.27.57 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. 2025 ఏప్రిల్‌లో అకాల వర్షాలతో నష్టం సంభవించింది. జిల్లాలో 2253 హెక్టార్లలో పంటనష్టం సంభవించింది. 1821 మంది రైతులకు రూ.16.83 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది.

**సత్యసాయి జిల్లాలో..**

సత్యసాయి జిల్లాలో 2024 ఖరీఫ్‌లో సంభవించిన కరువు కారణంగా 46,836 హెక్టార్లలో నష్టం సంభవించింది. దీనికి సంబంధించి రూ.62.46 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. అక్టోబరులో అధిక వర్షాల వల్ల 562 హెక్టార్లలో పంటనష్టం సంభవిస్తే దానికి రూ.49.11 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. నవంబరు నుంచి మే వరకు అకాల వర్షాలతో 284 హెక్టార్లలో పంటనష్టంకు రూ.19.09 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. రబీలో వర్షాభావం ఏర్పడినందుకు 1419 హెక్టార్లలో పంటనష్టానికి రూ.1.21 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. ఈ ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

**ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలి**

ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలి. ఇవి చేస్తే ఈ ఏడాది పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడులకైనా డబ్బులు రైతులకు అందుతాయి. ఇప్పటికే గతేడాది నుంచి రైతుకు ప్రభుత్వపరంగా అందుతున్న సాయం శూన్యంగా ఉంది. నష్టపోయిన రైతుకు సకాలంలో సాయం అందించి ఆదుకోవాలి.

**చంద్రశేఖర్‌రెడ్డి**
**ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.**

# ప్రకృతికి రక్షణ ఇద్దాం

◆ దాన్ని సంరక్షిస్తే...అది మనల్ని సంరక్షిస్తుంది..
◆ ప్రపంచ ఎడారి నివారణ దినోత్సవంలో వక్తలు
◆ ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో సదస్సు




మాట్లాడుతున్న ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'మానవుడు ప్రకృతికి యజమాని కాదు... ధర్మకర్త మాత్రమే' అని అలాంటి ప్రకృతిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని పంగల్ రోడ్డు వద్దనున్న ఆర్డీటీ ఇన్‌క్లూజీవ్ హైస్కూల్ ఆవరణంలో 'ప్రపంచ కరువు, ఎడారి నివారణ దినోత్సవం'ను మంగళవారం నిర్వహించారు. ప్రకృతి సంరక్షణ, ఎడారి నివారణ కార్యక్రమాలకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి మానవుడు యజమాని కాదని.. ధర్మవ కర్త మాత్రమే అన్నారు. ప్రకృతిలో అసమతుల్యత ఏర్పడటం ద్వారా నేడు అనేక విపరిణామాలను ఎదుర్కొకావాల్సి వస్తోందన్నారు. జిల్లా రెవన్యూ అధికారి మలోల మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుపై ఆసక్తి పెరిగిందన్నారు. వ్యవసాయ పరిశోధాన సంస్థ ప్రిన్సిపాల్ సైంటిస్టు విజయ శంకర్ బాబు మాట్లాడుతూ హరిత విప్లవం తరువాత దిగుబడులు పెంచే క్రమంలో పెద్దఎత్తున రసాయనాల వాడకం పెరిగిందన్నారు. తద్వారా భూమి, నీరు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం పడుతోందన్నారు. కరువు అన్నది తక్కువ వర్షపాతం నమోదవడమే కాదు... భూసారాన్ని కూడా దెబ్బతీస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ లక్ష్మానాయక్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలియజేశారు. నీరు, మట్టి, కొండలను కాపాడటం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడగలమని ఎఫ్ఇఎస్ హెడ్ భక్తర్ వలి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ డైరెక్టర్ భానుజ, జిల్లా ఉద్యానవన అధికారి సుబ్రమణ్యం, ఎఆర్ఎస్ సైంటిస్టు మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్యేకు సమ్మె నోటీసు



ఎమ్మెల్యే దగ్గుపాటికి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నగర గౌరవాధ్యక్షులు గోపాల్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 20 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 123 మున్సిపల్ నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సుమారు 13వేల మందికిపైగా పని చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనేక రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేని పరిస్థితుల్లో సమ్మెకు పోతున్నట్లు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు అన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కమిషనర్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, కార్మికులు కిరణ్, వన్నప్ప, శివన్న, గౌరీ విజయ్, మధు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనాకు సంఘీభావంగా నిలుద్దాం : సిపిఎం



పాలస్తీనాకు సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇజ్రాయిల్ బీకర దాడుల్లో ఆస్తులు, ప్రాణాలు సర్వం కోల్పోతున్న పాలస్తీనాకు ప్రతి ఒక్కరూ సంఘీభావంగా నిలవాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అనంతపురం టవర్ క్లాక్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో దాదాపు 60 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. వీరిలో అత్యధిక మంది చిన్నారులు, మహిళలు ఉన్నారని తెలిపారు. ఇజ్రాయిల్ ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండడం అత్యంత బాధాకరం అన్నారు. ఇజ్రాయిల్ దేశం ఒక జాతిని సమూలంగా నాశనం చేసే విధంగా పాలస్తీనాపై దాడులు చేస్తోందన్నారు. ఇజ్రాయిల్ చర్యలను ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, సామాజిక కార్యకర్తలు, మానతావాదులు ఖండిస్తున్నా ఏమాత్రం లెక్క చేయడం లేదన్నారు. చిన్న పిల్లలపై చేస్తున్న దాడిని ఇజ్రాయిల్ ప్రభుత్వంలోని మంత్రులు సమర్థించుకోవడం మరింత క్రూరమైన చర్య అన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న ఈ దాడిపట్ల భారత ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. ఇజ్రాయిల్‌పై భారత్ మెతక వైఖరిని అవలంభించడం సరికాదన్నారు. వలసవాద వ్యతిరేక సంఘీభావం, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతునిస్తూ భారత్ సుదీర్ఘ కాలంగా అనుసరిస్తూ వచ్చిన వలసవాద వ్యతిరేక, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే విదేశాంగ విధానం నుంచి వెనక్కు తగ్గడం సిగ్గుచేటని విమర్శించారు. పాలస్తీనా ప్రయోజనాలకు ఇప్పటివరకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని కోరారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజలు పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట నారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, నగర్ కమిటీ సభ్యులు బాలకృష్ణ, రాజు, ఎన్టీఆర్ సీనా, లక్ష్మీనారాయణ ఎర్రిస్వామి, ఇస్మాయిల్, ఆది, ఆజాం, రామలింగారెడ్డి, రామాంజనేయులు, శంకర, మనీ, ఇజ్రాయిల్, ప్రసాద్, వలీ, సిద్దు, వెంకటేష్, రియాజ్ పాల్గొన్నారు.

# వైద్యసేవలు మెరుగవ్వాలి

## కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆసుపత్రుల్లో వైద్యసేవలను మెరుగు చేసేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు, సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, ప్రయివేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్లు, వైద్య మిత్రలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడమన్నారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో ఉదయం ఒక ఆసుపత్రి, మధ్యాహ్నం ఒక ఆసుపత్రిని పని దినాల్లో డా॥ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్, డిసిహెచ్‌ఎస్‌లను ఆదేశించారు. ప్రయివేటు ఆసుపత్రులను పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో డా॥ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా॥కిరణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా॥పాల్ రవికుమార్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## అవయవదానం



ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రానికి అంజి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందకొచ్చారు. గత ఆదివారం సాయంత్రం బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజి తలకు బలమైన గాయమై బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆయన సతీమణి బెస్త కనుమల కృష్ణమ్మ, కుమారులు కనుమల మణికంఠ, హరినాథ్ ఆలోచించి అవయవ దానానికి ముందుకొచ్చారు. దీంతో మంగళవారం అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో అంజి శరీరంలోని అవయవాలను సేకరించారు. మరికొన్ని అవయవాలను నెల్లూరు, మరికొన్ని అవయవాలను కర్నూలుకు పంపించారు. అవయవదానానికి ముందుకొచ్చిన అంజి కుటుంబ సభ్యులను మండల వాసులు ప్రశంసిస్తున్నారు.

## గుత్తి డీటీగా సూర్యనారాయణ



ప్రజాశక్తి-గుత్తి

మండల డిప్యూటీ తహశీల్దార్‌గా ఎంకె సూర్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ లలిత అనంతపురం హెచ్ఎల్సీ డీటీగా బదిలీ అయ్యారు. దీంతో గుత్తి సీఎస్‌డీటీగా ఉన్న సూర్యనారాయణను రెగ్యులర్ డీటీగా ఇక్కడే నియమించారు. డీటీ ముందుగా తహశీల్దార్ ఓబులేసును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన డీటీని వీఆర్ఎలు సుధాకర్, జగదీష్, చిరంజీవి, ధన, తదితరులు పూలమాలలతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.

# పాత్రికేయులకు అండగా ఉంటాం

**కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి - ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ**



విద్యార్థికి పుస్తకాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో జరుగుతున్న మంచి, చెడును ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వం, అధికారులకు వారధిగా నిలుస్తున్న పాత్రికేయుల సంక్షేమానికి అండగా నిలుస్తామని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(ఎపిడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల పిల్లలకు ఉచితంగా నోటుపుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షఫీఉల్లా, రేపటి రామాంజినేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు ఐఅండ్‌పిఆర్ డిఐపిఆర్ఒ బాలకొండయ్య, బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ, పివికెకె ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో పాత్రికేయుల పిల్లలకు నోటు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన తండ్రి పాత్రికేయుడని, తాను కూడా ఆ రంగానికి చెందిన కుటుంబం నుంచి వచ్చానన్నారు. సమాజం కోసం పని చేస్తున్న వారిలో పాత్రికేయులు ఒకరన్నారు. జిల్లాలో పాత్రికేయుల పిల్లలకు అన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలియజేశారు. జర్నలిస్టుల గ్రీవెన్స్‌ను పరిష్కరించేందుకు ఇన్‌ఛార్జిగా డిఐపిఆర్ఒ ఉంటారని తెలిపారు. డిఐపిఆర్ఒ కార్యాలయానికి వారానికి ఒకరోజు ఒక లిఖితమైన సమయాన్ని ఇస్తామని, ఆరోజు పాత్రికేయులకు ఎలాంటి సమస్య ఉన్నా అర్జీ రూపంలో ఇవ్వొచ్చని తెలియజేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమానికి తమవంతు సహకారాన్ని శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. గత 40 ఏళ్లగా తమ కుటుంబం అభివృద్ధికి పాత్రికేయులు ఇచ్చిన తోడ్పాటు మరువలేనిదని చెప్పారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందిన ఉరవకొండకు చెందిన హెచ్ఎంటివి పాత్రికేయుడు నాగరాజు పిల్లల చదువుకు అయ్యే ఖర్చును శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా భరిస్తామని ఆ సంస్థ చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి వెల్లడించారు.

అంతకుముందు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీ ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు పాత్రికేయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాత్రికేయుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఫీజురాయితీతో పాటు ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు సమస్యలను పరిష్కరించాలన్నారు. వీటిపై కలెక్టర్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆజాద్‌తో పాటు జిల్లాలోని పాత్రికేయులు పాల్గొన్నారు.


# 'తల్లికి వందనం'పై దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం అమలుపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొడదామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ గతంలో జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం కుటుంబంలో కేవలం ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పథకం అమలు చేసిందన్నారు. ఇందుకు రూ.5,540 కోట్ల ఖర్చు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాదే దాదాపు రూ.1,00,091కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తద్వారా 67.27లక్షల మందికి లబ్ధి చేకూర్చిందన్నారు. వీరిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు 48,68,000 మంది ఉన్నారన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తమ పైశాచిక ఆనందం కోసం దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వైసిపి ఎంత దుష్ప్రచారం చేసినా కూటమి ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం పేదలకు లోకేష్ ఇచ్చిన గొప్ప వరం అన్నారు. దీన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. త్వరలోనే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలుస్తామన్నారు.

# జగన్..అంతా మీలా ఉండరు..!

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

'అమ్మఒడి పథకం పేరుతో ప్రతి విద్యార్థి నుంచి రూ.2వేలు తీసుకుని తాడేపల్లికి తరలించిన జగన్.. అందరూ నీలా ఉండరు..' అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేశాక ప్రతి కుటుంబంలో అమ్మ సంతోషంగా కనిపిస్తోందన్నారు. జీర్ణించుకోలేని వైసిపి నాయకులు తల్లికి వందనం పథకంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. నారా లోకేష్ రూ.2వేలు తీసుకున్నట్లు నిరూపించమంటే ఏఒక్క నాయకుడూ ముందుకు రావడం లేదన్నారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని.. కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందనం కింద రూ.13వేల కోట్లు అందించిందన్నారు. గతంలో అమ్మఒడి ఎప్పుడు వస్తుందా.. అని ఎదురు చూసేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం పాఠశాల తెరిచిన రోజే తల్లుల ఖాతాల్లోకి డబ్బు జమ చేశారన్నారు. ఓవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

# కుళ్లాయిస్వామి ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కేశవనాయుడు

**ప్రజాశక్తి-నార్పల**

ఈనెల 27వతేదీన ప్రారంభం కానున్న మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలపై మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మమతాదేవి ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్‌డిఒ కేశవనాయుడు శాఖల వారీగా వివరణ కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన పనులు వారు నిష్పక్షపాతంగా చేసి ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిపిఒ విజయ్‌కుమార్‌రెడ్డి, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు, సీఐ కౌలుట్లయ్య ఎక్సైజ్ సీఐ సునీత, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీరాములు, ఎఇ జనార్దన్, విద్యుత్ ఎడిఇ రఘు, ఎఇ నీలకంఠ, సిఐ కౌలుట్లయ్య, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎస్ఐ సాగర్, గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకేతపురం శోభ, పిఆర్ ఇంజినీర్ రమణయ్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ అక్కులప్ప, సిడిపిఒ భారతి, ఎపిఒలు రమేష్, రామారావు, ఎర్రమ్మ, ఎపిఎం తిప్పమ్మ, దేవాదాయ శాఖ సిబ్బంది లింగారెడ్డి, గోపాల్, గూగూడు గ్రామ పెద్దలు జాఫర్‌వలి, శివయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

## ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్



ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

**ప్రజాశక్తి-నార్పల**

క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అన్నారు. వెంకట్ వకుళా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం మొదటగా బ్యాటింగ్ చేసిన బుక్కరాయసముద్రం జట్టు 12.1 ఓవర్లకు 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్పల జట్టు 12.1 ఓవర్లకు 99 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు బహుమతు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాంచూఫెర్రర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న వెంకట్ వకుళ ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ వకుళా ఫౌండేషన్ వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# యోగాతో మెరుగైన ఆరోగ్యం

## విద్యుత్ శాఖ ఎస్ఇ శేషాద్రిశేఖర్

**ప్రజాశక్తి-అనంతపురం**

ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందుతారని విద్యుత్ శాఖ ఎస్ఇ శేషాద్రిశేఖర్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రంలో భాగంగా అనంతపురం జిల్లా విద్యుత్ శాఖ ప్రాంగణంలో విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖలు సంయుక్తంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు యోగాంధ్ర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారిణి ఇబి దేవి, విద్యుత్ శాఖ అధికారులు టెక్నికల్ గురవయ్య, వాణిజ్య పన్నుల స్టేట్ జిఎస్‌టి జాయింట్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్‌రావు, ఎసిలు నరసింహులు, సోనియా తారా, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బిఎన్ సుబ్బన్న, ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, లాల్యానాయక్, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, వివేకానంద యోగా కేంద్రం రాజశేఖర్ రెడ్డి, మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థినికి అభినందన

**ప్రజాశక్తి-గుంతకల్లు**

నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకుతో ఎంబిబిఎస్ సీట్ సాధించిన ధరణికి స్థానిక విజ్ఞాన్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల యాజమాన్యం మంగళవారం సత్కరించి ప్రోత్సాహక బహుమతి రూ.10వేలు అందజేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థిని ధరణి నీట్ ఫలితాల్లో ఎంబిబిఎస్ సీటు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. అందుకు నిదర్శనం ధరణి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ అంజి, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## రికార్డులు సరిచేయండి : ఎంపిడిఒ

**యల్లనూరు :** మండలానికి రెండు రోజుల్లో కేంద్ర బృందం రానున్న నేపథ్యంలో కార్యాలయంలోని రికార్డులన్నీ అధికారులు సరిచేయాలని ఎంపిడిఒ కరుణసాగర్ సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు సంబంధించిన రికార్డులను కేంద్ర బృందానికి అప్పజెప్పాలన్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి పుల్లారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు జయరామ్, కుళ్లాయిస్వామి, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో డీఎస్పీ పర్యటన

**యల్లనూరు :** మండల పరిధిలోని సమస్యాత్మక వెన్నపూసపల్లి, పాతపల్లి, జంగంపల్లి గ్రామాల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై ఆరాతీశారు. తర్వాత మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రికార్డులను పరిశీలించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**అనంతపురం రూరల్ :** రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 10మంది లబ్ధిదారులకు రూ.10.85లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రికి కుర్చీలు వితరణ

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వాసుపత్రికి కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు వాణిశ్రీ, బద్రీనాథ్ పెళ్లిరోజు, వాణిశ్రీ పుట్టినరోజును పురస్కరించుకుని వారి సహకారంతో 6 ప్లాస్టిక్ కుర్చీలు, 50 ప్లాస్టిక్ స్టూల్స్, ఒక బాక్స్ బిస్కెట్లను వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్రను విజయవంతం చేయాలి

**శింగనమల :** మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 6.30 గంగల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కావున యోగాలో యువతీ, యువకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

**ఏర్పాట్లు పరిశీలన**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎంపిడిఒ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల అధికారులు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, పలుశాఖల సిబ్బందితో కలిసి మైదానం అంతా కలియతిరిగి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

## కలెక్టర్‌కు సిఐటియు నాయకుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

పెన్నానది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట రైతులు, కూలీలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని శింగనమల, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల పరిధిలోని రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, గోపురాజుపల్లి, చిత్రచేడు, కల్లుమడి, ఇల్లూరు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న పెన్నానది పరీవాహక ప్రాంతాల నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇసుక రవాణాలను అరికట్టకపోతే రైతుల పొలాల్లో బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడితో వేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కౌలు రైతుసంఘ, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు, పెన్నా పరీవాహక ప్రాంత రైతులు, తరిమెల నాగరాజు, విశ్వనాథ్, చంద్రశేఖర్, భాస్కర్, భాస్కరరెడ్డి, రమణ, సుధీర్, రంగారెడ్డి, సంగప్ప, నారాయణరెడ్డి, సత్యనారాయణ, గోవర్ధన్, మల్లికార్జున, చిన్నప్పయాదవ్, కోటి, బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యాబోధనను మెరుగుపర్చుకోవాలి

## జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు


మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

**ప్రజాశక్తి-అనంతపురం**

అధ్యాపకులు సాంకేతికతను ఉపయోగించి విద్యాబోధనలో సృజనాత్మకతను మెరుగుపరుచుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు సూచించారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు శ్వవిద్యాలయంలోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో ఎన్ఇపి-2020, ఎన్‌సిఆర్‌ఎఫ్‌పై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ విద్యావిధానం-2020 వ్యవస్థలో జరుగుతున్న సమూల మార్పులు, అభివృద్ధి, సిలబస్ రూప కల్పనకు సంబంధించి పలుఅంశాలు చర్చించారు. భవిష్యత్‌లో విద్యా వ్యవస్థలో రానున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు అనుసరించాల్సిన విధానాలు, పద్ధతులను వివరించి, విద్యను మెరుగుపరచడానికి, విద్యార్థులకు మరింత సమగ్రమైన, బహుళ క్రమశిక్షణా విద్యను అందించేందుకు, వారిలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి అధ్యాపకులతో ఇష్టాగోష్టిగా చర్చించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ ఎన్ఇపి-2020, ఎన్‌సిఆర్‌ఎఫ్ సాంకేతికతను ఉపయోగించి విద్యను మెరుగుపర్చడానికి, ఉపాధ్యాయ శిక్షణను మెరుగుపర్చడ, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంచుకునే సౌలభ్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి వై.నరసింహులు, ఆచార్య వై.నరసింహులు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్లు ఎస్‌వి సత్యనారాయణ, ఆచార్య పిఆర్ భానుమూర్తి, వైశాలి ఘోర్పడే, జివి సుబ్బారెడ్డి, పి.సుజాత, పద్మసువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగప్రసాద్‌నాయుడు, బి.దుర్గాప్రసాద్, బి.ఈశ్వర్‌రెడ్డి, విబి చిత్ర, సి.శోభాబిందు, ఎ.సురేష్‌బాబు, ఎపి శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఆర్.భవాని, బి.చంద్రమోహన్‌రెడ్డి, శంకర్‌శేఖర్‌రాజు, కెఎఫ్ భారతి, టి.నారాయణరెడ్డి, ఎం.రామశేఖర్‌రెడ్డి, జి.మమత, ఎస్.అరుణ మస్తాని, వర్సిటీ పిఆర్ఒ బి.ఓంప్రకాష్, శ్రీధర్, జె.శ్రీనివాసులు, ఎం.అంకారావు, ఒటిపిఆర్ఐ ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో అభివృద్ధి చేసుకుందాం

## ఎమ్మెల్యే సురేంద్రబాబు


ఎమ్మెల్యే సురేంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

సమన్వయంతో కలిసి పని చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దురదకుంట గ్రామంలో అధికారులతో కలిసి పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా గ్రామాల్లో తిరిగి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేయాలని, విద్యుత్ వైర్లు మార్చాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులకు అదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడెకరాల్లో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తామన్నారు. త్వరలోనే బిటిపి పనులను ప్రారంభిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకంలో ప్రకటించిన మేరకు తల్లికివందనం పథకం అమలు చేశామన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి 27 రోడ్లు అనుమతులు వచ్చాయని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మిగిలిన రోడ్ల మంజూరుకు ఎస్టిమేషన్స్ పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**డ్రోన్ ఆపరేటర్ల శిక్షణను వినియోగించుకోండి**

డ్రోన్ ఆపరేటర్లుగా యువతకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. మంగళవారం స్థానిక ప్రజావేదిక వద్ద 'వ్యోమిక కంపెనీ' ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచిత డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు మంచి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగమే అమరావతిని డ్రోన్ హబ్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారన్నారు. ఇందుకు కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తోడ్పాటు అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, టిడిపి కార్యకర్తలు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సురేంద్రబాబుకు సన్మానం**

స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ధనునాయక్, కుబేర్‌యాదవ్, తెలుగు యువత నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ అందించిన పురస్కారాన్ని ఎమ్మెల్యే అందుకున్నందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ప్రకాష్, లోకేష్, భీమలింగ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నేతలకు చట్టాలు గుర్తుకురావడం హాస్యాస్పదం

## ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-పుట్లూరు**

వైసిపి నాయకులకు అధికారం పోయాక చట్టాలు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ సత్తెనపల్లి పర్యటనను చంద్రబాబు అడ్డుకుంటున్నారని వైసిపి నేతల ఆరోపణలు సరికావన్నారు. జగన్ గతంలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో పరామర్శకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించిన సంగతి వైసీపీ నేతలు గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో జరిగే ఘటనలను ఆసరా చేసుకుని రాజకీయ లబ్ధి కోసం కుట్ర పన్నుతున్నారన్నారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు వైసిపి శ్రేణులు ప్రజల ముసుగులో అరాచకాలు చేసేందుకు జగన్ ఉసిగొల్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగమే జగన్ పర్యటించిన హెలికాప్టర్‌పై వైసిపి శ్రేణుల దాడి అన్నారు. ప్రజాస్వామ్య పరిపాలన చూసి వైసిపి నేతలకు భయం చుట్టుకుందన్నారు. పర్యటన పేరుతో చేసే అరాచకాలును అణచివేసి, ప్రజలకు శాంతి భద్రతలు అందించే విషయంలో కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, రాము, జెఆర్.పేట బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ.. ఆత్మగౌరవం ఏదీ..?

**ప్రజాశక్తి-అనంతపురం**

రాష్ట్రంలో మహిళలకు రక్షణ, ఆత్మగౌరవం ఏదీ..? అని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదనేందుకు సిఎం చంద్రబాబు సొంత నియోకవర్గంలో జరిగిన ఘటనే ఉదాహరణ అన్నారు. మునికన్నప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్యను శిరీషను టిడిపి కార్యకర్త చెట్టుకు కట్టేసి కొట్టడం చూస్తుంటే రాజ్యాంగం ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం, పొలిటికల్ గవర్నెన్స్ పేరుతో వీధికో రౌడీని, గూండాను తయారు చేశారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పారిశుద్ధ్య పనులపై సమీక్ష


మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగరంలో చేపట్టిన పారిశుధ్య పనులు, తీరుతెన్నులపై మంగళవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రోజూ ఇంటింటి చెత్త సేకరణ, చెత్తకుప్పల తొలగింపుపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 24 గంటలలోపు చెత్తకుప్పలను తీసివేయాలని ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని వ్యాపారులందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం నగరపాలక సంస్థ రూపొందించిన 'ప్లాస్టిక్ వద్దు- క్లాత్ జూట్ బ్యాగ్ ముద్దు' అనే స్టిక్కర్‌ను శానిటేషన్ సెక్రటరీలకు అందజేశారు. అంతకు మునుపు ఉదయం నగరంలోని రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగర కమిషనర్, అశోక్ నగర్ బ్రిడ్జ్ వద్ద చెత్తను వెంటనే తొలగించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ ఆదేశించారు. ఈ సమీక్ష డిప్యూటీ కమిషనర్ పావని, సెక్రటరీ, ఇన్‌ఛార్జి హెల్తాఫీసర్ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## 'అగ్రిగోల్డ్' భూములకు హద్దులు గుర్తింపు

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని సంతేకొండాపురం గ్రామంలో అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన భూములకు హద్దులు గుర్తించినట్లు తహశీల్దార్ సుమతి తెలిపారు. ఈమేరకు మంగళవారం సంబంధిత భూములకు వద్దకు వెళ్లి హద్దులు ఏర్పాటు చేశారు. అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించిన మండలంలోని సంతేకొండాపురం గ్రామ పొలం సర్వే నెంబర్లు 9-1, 9-2, 9-3, 10-1, 10-2, 12, 23-6, 23-7, 25-1ఏ, 25-1డి, 28-1, 28-2, 28-3, 28-4, 31-2, 514-2, 516-2లో మొత్తం విస్తీర్ణం 76.44 ఎకరాల భూములకు హద్దులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీరాములు, ఎంపిడిఒ నందకిషోర్, ఎస్ఐ సాధిక్‌బాషా, డిఎస్‌సి కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, అగ్రిగోల్డ్ ప్రతినిధులు గౌస్, ఖాదర్, నాగరాజు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్లపై చర్యకు డిమాండ్

**గుంతకల్లు రూరల్ :** ఉచిత విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత విద్యను అందించాలనే చట్టం ఉందన్నారు. అయితే ఈ చట్టాన్ని ఎక్కడా అమలు చేయలేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ నాయకులు సత్తార్, జిలాన్, రామదాసు, తుర్కపల్లి రామంజి, బాషా, బాధితులు పాల్గొన్నారు.

## పరీక్ష ఫలితాలు విడుదల

**అనంతపురం :** ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల యూజీ, యూజీ ఆనర్స్, పీజీ పరీక్ష ఫలితాలను మంగళవారం స్థానిక ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ జివి రమణ, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పరీక్షల విభాగపతి తిరుమలేష్,ఉప పరీక్ష విభాగాధిపతులు అచ్చుతానంద, చంద్రశేఖర్, జిఎల్‌ఎన్ ప్రసాద్, పల్లవి, ఫిరోజ్‌ఖాన్, అహ్మద్, నరసింహులు, సోమశేఖర్, కేశాలు, సూగప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం

**అనంతపురం :** అనంతపురం రూరల్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు గుజ్జల వరలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధిపై వివరించారు. అనంతరం పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు వారి పరిధిలోకి వచ్చే నాలుగు గ్రామాల అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో జడ్పిటిసి జూటూరు చంద్రకుమార్, మండల ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎంపిడిఒ దివాకర్, ఎంఇఒ వెంకటస్వామి, ఎటిఎం నాంచారమ్మ, వెటర్నరీ డాక్టర్, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## మలేరియాపై అవగాహన

**యాడికి :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలాయపల్లి గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసుల ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, వంటి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎఎన్ఎం జీనత్ ఎంఎఫ్‌టు డైరీ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎం జీనత్, మేల్ హెల్త్ అసిస్టెంట్ మదిలేటి, ఆశా కార్యకర్త రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణపై అపోహాలొద్దు : ఆర్‌డిఒ

**గుంతకల్లు రూరల్ :** నూతనంగా నిర్మిస్తున్న రైల్వే రోడ్డు నిర్మాణానికి చేపట్టిన భూ సేకరణపై రైతులు అపోహలు పెట్టుకోవద్దని ఆర్‌డిఒ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సంబంధిత రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూసేకరణపై ఎవరికి ఎలాంటి అపోహాలు, అభ్యంతరాలు ఉన్నా తెలపవచ్చన్నారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను తహశీల్దార్ రమాదేవి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మండల స్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా రామచంద్రుడు

**కళ్యాణదుర్గం రూరల్ :** స్థానిక ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా రామచంద్రుడు నియమితులయ్యారు. ఇక్కడ ఉన్న ఫారెస్ట్ ఆఫీసర్ బదిలీ కావడంతో కర్నూలు జిల్లా నుంచి వచ్చిన రామచంద్రుడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఉరవకొండ :** యోగాతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగా గురువు నాగమల్లి ఓబులేసు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రేణుమాకులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యయులు సాకే భాస్కర్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ తరగతులతోపాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా కామన్ యోగా ప్రొటోకాల్‌ను విద్యార్థులకు ప్రముఖ యోగా గురువు నాగమల్లి ఓబులేషన్ సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు సంఘీభావం

**ఉరవకొండ :** మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' ప్రజాపరిరక్షణ పాదయాత్రలో విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డితోపాటు వైసిపి నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సహాయం చేయకపోయినా పర్వాలేదుగానీ, సాయం చేసే వారికి తోడ్పాటు అందించాలని కోరారు. పాదయాత్రలో విడపనకల్ వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎస్సీ సెల్, బీసీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, గిరిబాబు, వైసిపి యూత్ విభాగం నాయకులు సత్తి, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల చెంతకు బాలిక

**అనంతపురం క్రైం :** తప్పిపోయిన బాలికను గంట వ్యవధిలోనే 4వ పట్టణ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సిఐ ఎన్.జగదీష్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రంపేట పంచాయతీ అజయ్ ఘోష్ కాలనీకి చెందిన మహేష్ తన కూతురు 12ఏళ్ల బొమ్మలాట మౌక్షిత కనిపించడం లేదని మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన సిఐ సిబ్బందిని అప్రమత్తం చేసి గంట వ్యవధిలోనే బాలిక స్థానిక నందమూరి నగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న 'కూటమి' పాలన

**అనంతపురం :** రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ యాక్ట్-30 పేరుతో ప్రభుత్వం అడ్డగోలు ఆంక్షలు విధించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా జగన్ పర్యటనలపై తీవ్రంగా భయపడుతున్న ప్రభుత్వం, ఎలాగైనా ఆయనను నివారించాలని కుట్ర చేస్తోందని మండిపడ్డాడు. మొన్నటికి మొన్న రామగిరి మండలంలో సామూహిక అత్యాచారం చేసిన బాలిక పరామర్శకు బయలుదేరితే అడ్డుకున్నారన్నారు. చివరకు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నా వేరే ప్రాంతానికి మార్చుకోవాలని పోలీసులు చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగి మృతి

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

మండల పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ఆర్ఎస్.కొండాపురానికి చెందిన అమర్ నాథ్ తాడిపత్రి అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్నారు. రోజువారి విధుల్లో భాగంగా ఇంటి దగ్గర నుంచి స్టీల్ ప్లాంట్‌కు ద్విచక్రవాహనంలో వస్తున్న సమయంలో స్టీల్ ప్లాంట్ సమీపంలో వాహనం అదుపు తప్పు కింద పడి ప్రమాదానికి గురయ్యారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందాడు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు.